# ఇల్లాలు

## వై. యస్. ప్రకాశరావు

ఆ రోజు ఆదివారం. క్రితం రోజునే జీతాలు పుచ్చాయి. అకస్మాత్తుగా పుట్టింది కోరిక ఎక్కడికైనా ప్రయాణం చేసిరావాలని. వెంటనే బయలుదేరాను మెయిల్‌లో కాకినాడ వెళ్ళి తిరిగి సాయంకాలానికి వచ్చేదామని. నీటుగా 'టకప్' చేసుకొని కళ్లకు గాగుల్స్ పెట్టి రిక్షాలో రాజమండ్రి టవున్ స్టేషన్ చేరాను. తీరా వెళ్ళేటప్పటికి మెయిల్ గంట లేటు అని తెలుసుకొని ప్రయాణంమీద నిరాశపడ్డాను. తిరిగి వెళ్లిపోదామా అనిపించింది పనిలేక ప్రయాణంచేసే నాలాటి ప్రయాణీకుడు పనిపైన ప్రయాణంచేసే ఇతర ప్రయాణీకులను అవస్థపెట్టటాని కిష్టంలేక. కాని ప్రయాణం చెయ్యాలని కోరుతున్న మనస్సును నిరాశపెట్టడాని కిష్టంలేక వెనుదిరిగి వెళ్లలేకపోయాను. ప్లాట్ ఫారమ్‌మీద కొంతసేపు తిరిగాను. కాలం గడవటం బహుకష్టమైంది. ఇంతలో రోడ్ మీద కాఫీ 'కేంటిన్'వైపు దృష్టి మరలింది. కేంటీన్ లోకిపోయి కాఫీ తీసుకున్నట్లయితే కొంత కాలం గడుస్తుందికదా అని బయలుదేరివెళ్ళి 'స్పెషల్ సెక్షన్'లో పంకాక్రింద కూర్చున్నాను. సర్వర్‌కు కాఫీకి ఆర్డర్ ఇచ్చి గాగుల్స్ తీసి ముఖంమీద చమటను చేతిరుమాలుతో తుడుచుకుంటుండగా ఆ బల్ల కెదురుగాకూర్చున్న ఓ పెదమనిషి 'ఎక్కడకు వెళ్ళాలి, నాయనా?' అని ప్రశ్నించాడు. 'కాకినాడ వెళ్ళాలి' అని సమాధానమిచ్చాను.

ఆయన వాలకంచూస్తే ఒక రిటైర్డ్ గవర్నమెంటు ఆఫీసర్ లా కనుపిస్తున్నాడు. తెల్లని పగంచేతులచొక్కా, రంగువెలిసిన కాకీ ఫుల్ పేంటులో 'టకప్' చేసి కళ్ళకు చత్వారంజోడు పెట్టాడు. ఆయన్ను చూడగానే కొంతసేపు ఆయనతో సంభాషణచేయాలని మనస్సుపుట్టింది.

'చదువుకుంటున్నావా?' అని మరల ప్రశ్నించాడాయన.

'లేదు, ఉద్యోగం చేస్తున్నా'నని సమాధానమిచ్చాను. సంతోషమున్నట్లుగా ఆయన ముఖసూచనచేసి మళ్ళీ ప్రశ్నించాడు.

'ఏడిపార్టుమెంటులో పనిచేస్తున్నావు, నాయనా?'

ఆయన వేసే ప్రశ్నలధోరణిచూచి, ఇంకా వివరాలన్నీ కనుక్కుంటాడని ముందుగానే గ్రహించి, ఆయన అడగబోయే వివరాలన్నీ చెప్పేసేను. నామాటలు వింటూనే ఆయన ఏదో ఆలోచనలో పడ్డాడు.

'ఏమండీ అలా ఆలోచిస్తున్నారు? నేనేమైనా మీకు తెలుసా?' అని అడిగాను.

'ఆ, ఏమీ లేదు, నీవు చెప్పింది వింటూంటే నాకేదో చిన్ననాటి సంఘటన జ్ఞాపకమొస్తున్నది' అన్నాడాయన గొంతుక సవరించుకుంటూ.

రైలు కింకా చాల టైమున్నది కదా - ఆయనదగ్గరనుండి ఆ విషయ మేమిటో తెలుసుకోవా లనిపించింది. ఇంతలో సర్వర్ కాఫీ తీసుకొచ్చి నాముందు పెట్టాడు. ఆ కాఫీ ఆయన కందిస్తూ, మరో కప్పు తీసుకురమ్మని సర్వర్‌తో చెప్పాను.

"నే నిప్పుడే తీసుకున్నా, ఫరవాలే, నీవు తీసుకో' అన్నాడాయన.

కాఫీ ముగించి ఇరువురం బయటకు వచ్చాం. నేను రెండు కిళ్ళీలుకొని ఒకటి ఆయనకిచ్చి రెండవది నేను వేసుకున్నా. నేరుగా స్టేషనుకు పోయి ప్లాట్‌పారం చివర్న ఒక పెద్ద చెట్టుక్రింద ట్రాలీమీద కూర్చున్నాం.

'మీ రేడిపార్టుమెంటులో పనిచేసి రిటైరైనారండీ' అని ప్రశ్నించాను, విషయ మేమిటో తెలుసుకుందామని. ఆయన చెప్పాడు. ప్రభుత్వోద్యోగంలో రిటైర్ అయ్యాడు.

'నా విషయంవింటే మీ చిన్ననాటి సంఘటన జ్ఞాపకమొచ్చిం దన్నారు?' అన్నాను.

"అవును. చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది. నేను చేసిన పాపం చెప్పుకుంటే నాకూ కొంత మనస్థిమితం కలుగుతుంది. నీకూ ఒక ఉదాహరణగా ఉంటుంది, విను నాయనా." అన్నాడాయన.

* * *

నా కించుమించు ముప్పైసంవత్సరాలుండవచ్చు. ఒకరోజున అఫీసు పనిపైన ఒక పల్లెటూరు వెళ్ళా. ఆ గ్రామం చేరేటప్పటికి సాయంత్రం అయిదుగంటలు కావస్తోంది. గ్రామమునసబుగారింటికి వెళ్ళి నా హోదా చెప్పుకుని నాకు భోజనపానాదులు సమకూర్చుకున్నా. గృహస్థు నలభైయేళ్లు పైబడిన మనిషి. ఇంట్లో ఆయన భార్య, మూడునాలుగేళ్ల ఆడపిల్ల తప్ప మరెవ్వరూ లేరు. ఆయన భార్య పెద్ద అందగత్తె కాకపోయినా కురూపి మాత్రం కాదు. ఇరవై సంవత్సరాలు పైబడిఉండవు. ద్వితీయవివాహమనుకోవచ్చు. నా స్నానమైన తరువాత గృహస్థుతో కలిసి భోజనం ముగించాను. అరుబయట వసారాలో నాకు మునసబుగారికి వేర్వేరు మంచాలు వేసి ఆయన భార్య వసారా ననుసరించివున్న గదిలో మంచంమీద పిల్లను వేసుకొని పడుకొంది. నాకు కావలసిన సౌకర్యాలన్నీ కూడ మునసబుగారు భార్య చేతనే ఏర్పాటుచేయించారు. ఆమెకూడా ఎరమరికలేక చాల చనువుగ మసిలింది. ఆమె నడవడికను చూచి నేనామెను తప్పు అర్థం చేసుకున్నాను. రాత్రి సరిగా పన్నెండు గంటలు దాటిఉంటుందేమో. నాకుమాత్రం నిద్రపట్టలేదు. నా ప్రక్కను గృహస్థు గాఢనిద్రలో ఉన్నాడు. ఆమెగురించి నాకు కలిగిన భావములు నన్ను కలవరపరిచాయి. నే నెటువంటి ఉద్రేకానికి గురి అవుతున్నానో నా కప్పటి పరిస్థితులలో ఒళ్లు తెలియలేదు. నెమ్మదిగా లేచి చూచాను. గృహస్థు గాఢనిద్రలో వున్నాడని నిశ్చయపర్చుకొని, నెమ్మదిగా తడబడుతున్న అడుగులతో గదిలోకి వెళ్ళాను. ఆమె పిల్లపక్కన పడుకుని గాఢంగా నిద్రపోతోంది. నేను వెళ్ళి వణకుతున్న చేతులతో ఆమెను తట్టాను. ఆమె ఆ నిద్రలో కళ్లు తెరచిచూచి కలవరపడింది. నే నామెచేయి పట్టుకో ప్రయత్నం చేశాను. ఆమె వణికిపోతూ "వస్తా నుండండ"ని చెప్పి పిల్లతోసహా బయటకు వెళ్ళి తలుపు గొళ్ళెం పెట్టింది.

తెల్లవారుతోంది. రాత్రి నేనుపడ్డ అవస్థ భగవంతునికే తెలుసు. మనస్సులో ఏదోభీతి దృఢంగా నాటుకుంది. నేను చేసిన తుచ్ఛమైనపనికి నన్ను నేనే నిందించుకున్నా. స్త్రీ మన సత్వ మెరక్కుండా ప్రవర్తించినందుకు నన్ను నేనే తిట్టిపోసుకున్నా. ఆ గదిలోనే తెల్లవారేలోగా ప్రాణం విడి

(49-వ పేజీ చూడండి)

## ★ దాక్షిణ్యాలోభం ★

(10-వ పేజీ తరువాయి)

"అయ్యగారు నన్ను తీసుకువచ్చారు. అయ్యగారు పొమ్మంటేనే పోతాను" అని ఖచ్చితంగా చెప్పివేసింది సుబ్బి. మీనాక్షి ఒక క్షణం స్తంభించిపోయింది. తన ఇంటి దాసి తన్నెదిరించడమే! తననే చులకన చేయడం! "పోతావా పోవా" అని అరిచింది మీనాక్షి కంపిస్తున్న పెదవులతో.

"అయ్యగారు పొమ్మంటేనే పోతానని చెప్పానుకదా, అమ్మగారూ" అంది సుబ్బి చలించకుండా.

మీనాక్షి భర్తదగ్గరకు పరుగెత్తింది. "నేను మొదట్లోనే చెప్పలేదూ, దానిది గడ్డితినే బుద్ధి అని. తిన్న యింటి వాసాలు లెక్కపెట్టే బుద్ధి! దానిని ఇక ఒక క్షణం ఇంట్లో ఉంచడానికి వీలు లేదు. నేను పొమ్మంటే పోదట! మీరు పొమ్మనాలట. నేనంటే దానికంత అలుసయిపోయాను కాబోలు! పాపిష్టిముండ! దానిని జుట్టు పట్టుకొని అవతల కీడ్చేస్తారా లేదా" అంటూ ఆడపులిలా గాండ్రించింది మీనాక్షి.

శంకరం బెల్లం కొట్టిన రాయిలాగా మాట్లాడకుండా నిలబడిపోయాడు ఒక్కసారి సుబ్బికేసిచూసి తలవంచేసుకున్నాడు. సుబ్బి అతనికేసి సూటిగా చూసింది—ఏం జవాబు చెప్తారు, నన్ను పొమ్మనగలరా—అని అడుగుతున్నట్లు.

"ఏమండీ మాట్లాడరేం? నేను పొమ్మంటే పోదూ! నే నెవత్తె ననుకుందో! ఏం, దాన్నీ క్షణం జుట్టుపట్టుకు ఈడ్చేస్తారా లేక నేను పుట్టింటికి వెళ్లిపోనా?" అని మళ్లీ ఉరిమింది మీనాక్షి. శంకరం పని అడకత్తెరలో పోకచెక్కలా అయింది. ఏమనాలో అతనికి తోచడం లేదు. ఇంతలో సమయానికి దేవుడిలా ఎవరో వీధిలోనుంచి "శంకరం" అని కేక వేశారు. బ్రతుకుజీవుడా అనుకుంటూ శంకరం వీధిలోకి పరుగెత్తాడు.

శంకరానికి సుబ్బితో వెళ్ళిపొమ్మని చెప్పనే అక్కర్లేకపోయింది. ఆమె ఆ రాత్రే ఎవరితోనూ చెప్పకుండా వెళ్లిపోయింది. మర్నాడు పొద్దున్న వెతుక్కున్న తర్వాత తెలిసింది ఆమె వెళ్ళిపోయిందని. మీనాక్షి కించిత్తైనా చింతించ లేదు సరికదా పీడావదలిపోయింది అని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచింది. కాని పోయేది చేతిలో ఏమైనా పట్టుకుపోలేదు కదా అని అనుమానం వేసి కంగారుగా అన్ని గదులూ చూసుకుని, అన్నీ ఉన్నాయి అని మనస్సు కుదుటబరుచుకుంది. కాని భార్య మాట వినేసరికి శంకరానికి ఎందుకో అనుమానం తోచింది. పెట్టె చూసుకున్నాడు. అరె! రైతు లంతకుముందురోజు ఇచ్చిన ఆరు వంద లేవీ? పెట్టె అంతా తిరగవేసి చూశాడు. అలమారా చూశాడు. చొక్కా జేబులూ, కోటుజేబులూ అన్నీ వెదికాడు. ఎక్కడా కనిపించలేదు. ఆరు వందలూ! పెట్టెలోనే పెట్టినట్లు తనకు పూర్తిగా జ్ఞాపకం. అతను వెతుక్కుంటూంటే మీనాక్షి అడిగింది "ఏమిటి, దేనికోసం వెతుకుతున్నారు" అని. "ఆఁ ఏమీ లేదు కళ్ళజోడుకోసం" అనేశాడు శంకరం కళ్లజోడు ఎదురుగా అలమారాలో ఉండగానే.

మర్నాడు మీనాక్షి అడిగింది అతనిని రైతు లిచ్చిన ఆరు వందలూ బాంకులో కట్టేశారా అని. కట్టేశా నన్నాడు శంకరం. అనక మరి ఏం చేయగలడు?

అందుకే ఏటి ఒడ్డున రావిచెట్టు నీడన కూర్చుంటే ముసలి బైరాగి ప్రతి పదిహేను నిమిషాలకీ ఒక్కసారి అంటూ ఉంటాడు "చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ!" అని. ★

## ★ ఇల్లాలు ★

(11-వ పేజీ తరువాయి)

చేద్దామా అనిపించింది. కాని మళ్ళీతట్టింది. నేను చేసినపని తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టటం. వారింట ప్రాణం తీసుకోటం మర్యాదస్తుడైన గృహస్థుకు ప్రాణాపాయం తెచ్చిపెట్టడమే కాక, వారి వంశమర్యాదను భంగపర్చటమని భావించి విసుదీశాను. తెల్లవారగానే గ్రామస్థుల ఎదుట నన్ను నిలదీయగలరని దృఢంగానమ్మాను దానితో శరీరం కంపించింది. తెల్లవారేలోగా ఇంచుమించు ఇరవై ముప్ఫైసార్లు తలుపులాగి చూచాను, కాని రాలేదు. దానితో మరింత భయపడ్డాను. తెల్లవారింది వారింట్లో కోడి ఎలుగెత్తి 'కొక్కొరోకో' అని కూసింది. అదిరిపడి మళ్ళీవెళ్ళి తలుపులాగి చూచాను. తలుపుగొళ్లెం తీసివుంది. మునసబుగారు మంచంమీద ఇంకా నిద్రపోతున్నారు. ఇలాలు దొడ్లో ఏదో ఇంటిపని చేసుకుంటోంది. నేను గాబరాపడుతూ సామాన్లు సర్దుకొని అక్కడ ఉండడానికి కిష్టంలేక వెంటనే బయలుదేరాను. అది గమనించి ఇల్లాలు వెంటనే భర్తను లేపింది. ఆయన లేవటంతో నాకు మరింత గాభరా ఎక్కువైంది. ఆయన మరోగదిలోనికి వెళ్ళి బట్టలు సవరించుకవచ్చి 'ఏమండీ అంత కంగారు పడతారెందుకు, తాపీగా స్నానంచేసి కాఫీ తాగి వెళ్ళండి' అని గృహస్థధర్మంగా అన్నాడు కాని ప్రేమపూర్వకంగా అన్న ఆమాటలతో నాకు శరీరం దహించుకుపోతున్నట్లయింది. ఎట్లాగో ముళ్ళమీద నుంచున్నట్లు వారికోరికనుమన్నించి తిరవాతవెళ్తూ 'వెళ్ళొస్తాను చెల్లెమ్మా' అన్నాను. 'వెళ్లిరాండి అన్నయ్యగారూ' అందిఇల్లాలు. నాకామాట బల్లెంతో పొడిచినట్లయింది.

వెళ్ళి వెంటనే ఆత్మహత్య చేసుకోవడం మంచిదనిపించింది. మానవ మనస్తత్వం నీకు తెలియందికాదు, నాయనా. పాతిక సంవత్సరాలనుండి ఈ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నేను చేసినతప్పు ఎవరితోనో చెప్పి పశ్చాత్తాపంపొంది దాని ద్వారా కొంత మనఃస్థిమితం కలుగచేసుకుంటున్నాను. అని ఆయన కథ ముగించాడు.

అప్పట్లో ఆయనముఖంచూస్తే నాకే జాలివేసింది. ఓ విధంగా ఓదార్చకపోతే బాగుండదని మొదలుపెట్టా.

'తప్పు మానవుడు చెయ్యకపోతే మ్రాను చేస్తుందిటండీ? చేసిందానికి మీరు పశ్చాత్తాపం చెప్పకోనే చెప్పకుంటున్నారు. చేసినతప్పు ఈ రోజుల్లో ఎవరు చెప్పకుంటారండీ? మీరు చేసినపాపం చెప్పకున్నందువల్ల అప్పుడే పోయింది." అని సముదాయించేప్పటికి ఆయనముఖంలో కొంత వికాసం కన్పించింది.

"నాయనా యువకుడవు. నాకథ జ్ఞాపకముంచడం నీకూ మంచిదే నాయనా." అని చెప్పి ఆయన తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. నేను ఆలోచనలోపడ్డాను, ఆయన చెప్పిన సంఘటనలో ఆయన పడ్డ అవస్థకన్న ఆ ఇల్లాలి తెలివి తేటలు, సమానం నా ఆలోచనలో ప్రథమస్థానాన్ని పొందాయి. ఎంత నేర్పరితనంగా తన మానం రక్షించుకొని అతిథిని అగౌరవపర్చకుండా పంపింది! ఆడవాళ్ళందరూ అంత తెలివిగా ఉంటే ప్రపంచమే బాగుపడిపోను, అనిపించింది. ★

హకల్ బెరిఫిన్
వెల 2-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.